మేల్ చేసే పొదుపు

- పురుషుల పొదుపు సంఘాల ఏర్పాటుకు శ్రీకారం
- తెనాలి పట్టణంలో మొత్తం 39 గ్రూపుల ఏర్పాటే లక్ష్యం
- నేటికి 21 గ్రూపుల ఏర్పాటు
- ఈనెల 22వ తేదీలోపు మిగిలిన గ్రూపుల ఏర్పాటుకు చర్యలు


పొదుపు సంఘాల సమావేశం (ప్రతీకాత్మక చిత్రం)

తెనాలిఅర్బన్: నేటి సమాజంలో ఎక్కువగా వినిపించే మాట పొదుపు. ఇప్పటి వరకు ప్రభుత్వం మహిళలతో పొదుపు చేయించి వారికి బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించటం.. ప్రోత్సాహాలు ఇవ్వటం చేస్తూ వస్తోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి పురుషులతో ఇలాంటి గ్రూపులు ఏర్పాటు చేయించి వారితో పొదుపు చేయించే పనికి శ్రీకారం చుట్టింది. దీంతో మెప్మా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు.

తెనాలి పట్టణంలో ఇప్పటి వరకు 2,880కి పైగా స్వయం సహాక సంఘాల మహిళా గ్రూపులు ఉన్నాయి. వీటిలో సుమారు 28 వేల మందికిపైగా సభ్యులుగా ఉన్నారు. వీరందరూ ప్రతినెలా పొదుపు చేస్తూ ఆరు నెలల తర్వాత బ్యాంక్‌ల ద్వారా రుణాలు పొందుతారు. వాటిని నెలనెలా చెల్లిస్తూ వాయిదాలు పూర్తికాగానే మళ్లీ రుణాలు తీసుకోవటం జరుగుతూ వస్తోంది. అదే తరహాలో ప్రభుత్వం పురుషులకు పొదుపు గ్రూపులు ఏర్పాటు చేయాలని గతేడాది డిసెంబర్ 22న ఆదేశించింది. గుంటూరు తర్వాత అతి పెద్ద పట్టణంగా తెనాలి పట్టణం మారటంతో ఇక్కడ మొదటి విడత కింద 39 గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించింది.

ఐదుగురే గ్రూపు సభ్యులు

మహిళలకు సంబంధించిన గ్రూపులో 10 మంది సభ్యులు ఉంటారు. కానీ పురుషులకు సంబంధించిన గ్రూపులో ఐదుగురు మాత్రమే ఉంటారు. వీరిలో యాక్టివ్‌గా ఉన్న వారిని అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకుని గ్రూప్‌కు ఒక పేరు పెడతారు. తర్వాత గ్రూప్ పేరుతో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయించి ప్రతి ఒక్కరితో ప్రతినెలా రూ.200 పొదుపు చేయిస్తారు. ఆరు నెలల తర్వాత వారికి బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

21 గ్రూపులు ఏర్పాటు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో మెప్మా రిసోర్స్ పర్సన్‌లు ఇంటింటి సర్వే నిర్వహించారు. తెనాలి పట్టణంలో ఇప్పటి వరకు 21 గ్రూపులు ఏర్పాటు చేయించారు. మిగిలిన 18 గ్రూపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 22వ తేదీలోపు మిగిలిన గ్రూపులు ఏర్పాటు చేయనున్నారు.

గ్రూప్ సభ్యుల ఎంపిక ఇలా..

పురుషుల పొదుపు సంఘాల గ్రూపులను ఆరు కేటగిరీలుగా ఏర్పాటు చేశారు. మొదటి కేటగిరి కింద కార్పెంటర్లు, ప్లంబర్‌లు, తాపీ పని చేసే వారు, పెయింటర్స్, ఇతర బిల్డింగ్ వర్కర్స్ ఉంటారు. రెండో కేటగిరి కింద మున్సిపల్ కార్యాలయం పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, వారి భర్తలు, మూడో కేటగిరి కింద అమేజాన్, స్విగ్గీ, జొమాటో తదితర సంస్థల డెలివరి బాయ్‌లు, నాలుగో కేటగిరి కింద వృద్ధులు, చిన్న పిల్లలకు కేర్ టేకర్‌లుగా పనిచేసే వారు, ఐదో కేటగిరి కింద ఎలక్ట్రీషియన్‌లు, ఏసీ, ఫ్రిజ్, గృహోపకరణాలు రిపేర్ చేసేవారు, ఆరో కేటగిరి కింద మున్సిపాలిటీ, కార్పొరేషన్, పంచాయతీలలో పనిచేసే డ్రైవర్లు ఉంటారు. వీరి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలి. ఈ ఆరు కేటగిరిలలో పనిచేసే స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యుల భర్తలకు కొంత ప్రాధాన్యం ఇస్తున్నారు. భార్య, భర్తలు గ్రూపులలో ఉంటే రుణాల చెల్లింపులు సకాలంలో జరుగుతాయనే భావనతో ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

అర్హులు గ్రూపుల్లో చేరాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు పురుషుల పొదుపు సంఘాల గ్రూపులు ఏర్పాటు చేసే ప్రక్రియ తెనాలిలో జరుగుతోంది. ఇప్పటికే 21 గ్రూపులు ఏర్పాటు చేశాం. మిగిలిన గ్రూపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రూపుల ఏర్పాటుతోపాటు వీటి నిర్వహణ బాధ్యతలు ఆర్‌పీలు చూస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారు నన్ను, ఆర్పీలను సంప్రదిస్తే వెంటనే గ్రూపులను ఏర్పాటు చేస్తాం. వీటి వల్ల పురుషులలో కూడా పొదుపు చేసే లక్షణం మరింత అలవడే అవకాశం ఉంది.

–గుంటూరు విజయ కుమారి,
మెప్మా విభాగ సిటీ మిషన్ మేనేజర్, తెనాలి పురపాలక సంఘం

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి

'ఇస్కఫ్' జిల్లా బాధ్యురాలు శ్రీదేవి

తెనాలి: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జిల్లా బాధ్యురాలు శ్రీదేవి అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే పలురంగాల్లో మహిళలు పురోగమించటం శుభపరిణామంగా చెప్పారు. స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో శనివారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీదేవి మాట్లాడారు. సమాన అవకాశాలు మహిళల హక్కుగా చెబుతూ, ఇందుకు సమాజ తోడ్పాటుతో పాటు ప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు. అధ్యక్షత వహించిన అన్నమాచార్య యూనిట్ గాయని సీహెచ్ అనూరాధ మాట్లాడుతూ ఇంటికీ, సమాజానికి మహిళలే వెలుగుగా చెప్పారు. నేటి తరం మహిళలు అద్భుతాలను సాధిస్తూ సమాజంలో తమకంటూ గుర్తింపును తెచ్చుకోవటం గొప్ప విషయమన్నారు. సభానంతరం శ్రీదేవి, అనూరాధ, కన్నెగంటి మౌనిక, వాణి, వీణ, అరుణ, తిరుపతమ్మలు లలిత సంగీత విభావరిని నిర్వహించారు. సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ వీరికి జ్ఞాపికలను అందజేశారు.

డాక్టర్ సుబ్రహ్మణ్యంకు 'వైద్యసేవారత్న' బిరుదు


డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యం దంపతులకు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముత్యంశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన వైద్యశిబిరంలో డాక్టర్ కటకం పురుషోత్తమరావు పర్యవేక్షణలో తెనాలి, గుంటూరు, విజయవాడకు చెందిన స్పెషలిస్టు వైద్యులు చిన్నపిల్లలు, గర్భిణులు, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ సమస్యలు, చర్మ సమస్యలకు రోగులను వంద మందిని పరీక్షించి మందులను ఉచితంగా ఇచ్చారు. అవసరమైనవారికి రక్తపరీక్షలు, దంత పరీక్షలకు స్పాట్ ఎక్స్‌రే, శ్వాసకోశ సమస్యలకు ఎండోస్కోపీతో పరీక్షలు చేశారు. వైద్య శిబిరం ముగిసిన అనంతరం ఏర్పాటైన సభలో పేదల డాక్టరుగా గుర్తింపును పొందిన ప్రముఖ వైద్యుడు, విశ్రాంత అడిషనల్ డైరెక్టర్, ఎంపీఎంహెచ్ఎస్ డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు 'వైద్యసేవారత్న' బిరుదును ప్రదానం చేశారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు. మానవత సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జె.హనుమంతరావు, డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద, డాక్టర్ తాడిబోయిన మస్తానమ్మ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ కె.పురుషోత్తమరావు చేతులమీదుగా సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు. వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లు గుత్తి కోటేశ్వరప్రసాద్, ఆర్.నవీన్, గుత్తి సుధారాణి, కె.నాగరాజు, దివి చైతన్య, ఆర్.శ్రుతి, కె.హిమజ, శ్రీనిధి, పవన్ కుమార్‌ను సత్కరించి. జ్ఞాపికలను బహూకరించారు. సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి గంజి శివభుజంగ ప్రభాకరరావు, కటకం వెంకట ప్రసాద్, కోశాధికారి దివి పురుషోత్తమ్, గౌరవాధ్యక్షుడు రాచాబత్తుని బ్రహ్మం, కార్యనిర్వహణ కార్యదర్శి పంచుమర్తి భాస్కరరావు, అక్కల శ్రీరామ్, జొన్నాదుల మహేష్, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

మహాయజ్ఞం పూర్ణాహుతి ప్రారంభం


108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికలను ప్రత్యేక వాహనంపై ఉంచి శోభాయాత్ర చేస్తున్న దృశ్యం

తెనాలి: స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ అంజనేయస్వామి ఆలయ కేంద్రంగా అష్టోత్తర శత కోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం ఆరంభమైంది. స్థానిక తాలూకా హైస్కూలు గ్రౌండ్‌లో ఆరురోజులపాటు జరిగే ఈ ఉత్సవాన్ని ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. రాష్ట్రం, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పూర్తిచేసిన 108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికలను ప్రత్యేక వాహనంపై ఉంచి శోభాయాత్రను శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభించారు. తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి జరిగే తెనాలి తాలూకా హైస్కూలు మైదానంలోని వేదిక వరకు శోభాయాత్ర సాగింది. అక్కడ సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహం, దీక్షా ధారణ, అంకురారోపణను వైఖానసాగమోక్తంగా జరిపారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు గోపూజతో వేడుకలు ఆరంభమవుతాయని, శ్రీసీతారాములకు పంచామృత స్నపన తదుపరి ఉదయం 10 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. భక్తజనులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. 11.30 గంటలకు బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణ మూర్తిచే ఆధ్యాత్మిక ప్రవచనం, సాయంత్రం 6.45 గంటలకు అవధాన సరస్వతీపీఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని వివరించారు. శోభాయాత్రలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్ రెడ్డి, వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ ఆర్వీ కిరణ్ కుమార్, కల్లూరి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


మందులు పంపిణీ చేస్తున్న వికాస తరంగిణి సభ్యులు, వైద్యులు

మంగళగిరి టౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి నగర పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో ఆదివారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళ శాసనాలతో పట్టణ వికాస తరంగిణి, మహిళా ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, వీఐఏ కాల్పోస్కోపీ, పాప్‌స్మియర్ తదితర పరీక్షలను మహిళలకు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ గిరిజ మాట్లాడుతూ మహిళలకు వైట్ డిస్చార్జి, ఎక్కువ బ్లీడింగ్, పిరియడ్స్ సరిగ్గా రాకపోయినా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళల్లో బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లు ఎక్కువగా వస్తున్నాయని, ఏడాదికి 75 వేల మహిళల్లో కొత్తగా క్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయని చెప్పారు.

గోవర్ధనస్వామి గుడిలో వైభవంగా జీవధ్వజ శిఖర ప్రతిష్ట


ఉత్సవమూర్తులతో అర్చకులు


జీవధ్వజ శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేకం


పాల్గొన్న భక్తులు

తెనాలి: పట్టణంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటైన నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోవర్ధన స్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం జీవధ్వజ శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేక ఉత్సవం వైభవంగా జరిగాయి. ప్రాచీన విశిష్టత కలిగిన ఈ దేవాలయంలో భక్తుల సహకారంతో స్వామి ముఖమండప పునర్నిర్మాణం పూర్తిచేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలో జీవధ్వజ శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేకాన్ని తలపెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం అంకురార్పణతో వేడుకలు మొదలయ్యాయి. శనివారం ఉదయం అగ్ని ప్రతిష్టాపన కుంభారాధన, శ్రీగోవర్ధనస్వామి, రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు కలశ స్నపన, జీవధ్వజ శిఖరానికి పంచగవ్యాధివాసము, క్షీరాధివాసము, జలాధివాసము, సాయంత్రం యుక్త హోమాలు, అగ్నిమథనము, పారమాత్మిక మహాశాంతి హోమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 10.54 గంటలకు జీవధ్వజ శిఖర ప్రతిష్ట, విమాన గోపురాలకు మహాకుంభాభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు దేవదాయ, ధర్మదాయశాఖ డెప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ హాజరయ్యారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి పర్యవేక్షణలో ఆలయ వంశపారంపర్య అర్చకులు టి.రఘు, వేదాంత మాధవభట్టాచార్యులు కార్యక్రమాలను జరిపించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల కుటుంబసభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, ఆత్రేయ, కేశవ, నరసింహభట్టాచార్యులు, యశ్వంత్, అనంతచార్యులు, రామాచార్యులు పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు రోజైన సోమవారం ఉదయం స్వామివారి శాంతి కల్యాణం, అన్నప్రసాద వితరణ ఉంటాయని, భక్తులందరూ ఆయా కార్యక్రమాలకు హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

హనుమంత వాహనంపై గ్రామోత్సవం



కొల్లిపర: కొల్లిపరలోని శ్రీదేవిభూదేవి సమేత జనార్దనస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం జనార్దన స్వామి రామావతారం అలంకరణలో గ్రామస్తులను కటాక్షించారు. హనుమంత వాహనంపై గ్రామోత్సవానికి తరలివెళ్లారు. భక్తులు స్వామికి కొబ్బరి కాయలు, పండ్లు, బియ్యం, హారతులు సమర్పించారు. ఆలయంలో తెల్లవారు జామున, సాయంత్రం వేద పండితులు స్వామి వారికి నిత్యహోమము, బలిహరణ, ఎదురుకోలోత్సవము, రాత్రి 9గంటలకు స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు, మహిళలు తెల్లవారు జాము నుంచి పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని స్వామిని దర్శించుకుని విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పండితులు జగన్నాథాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, యోగానంద పృధ్వి బార్గవ్, వీరభద్రేశ్వర కోటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, నాగరాజుశర్మ ఉన్నారు.

మతోన్మాద రాజకీయాలను తరిమికొడదాం


సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల

మంగళగిరి టౌన్ : మతోన్మాద రాజకీయాలను దేశం నుండి తరిమికొడదామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ దేశంలో ఎన్‌డీఏ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతం పేరుతో ప్రజలను విడదీసి వివాదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధానాల వల్ల లౌకిక ప్రజాతంత్ర వాదానికి దేశంలో పెను ప్రమాదం పొంచి వుందని ఆందోళన వ్యక్తం చేశారు.

సుందరయ్య నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్‌లో లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ వైద్యులు జి. గంగాధరరావు, ఆర్. జ్యోతి ప్రకాష్‌రెడ్డి, కె.సాయి హితీష్, అనూష, అచ్యుతబాబు, రామకృష్ణ, నాగమాన్య, రంగనాథ్, జ్యోతి అభిషేక్, రవితేజ, కోమలి, అపూర్వ వైద్య సేవలను అందించారని తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కిడ్నీ అల్ట్రా సౌండ్ స్క్రీనింగ్, గుండె ఈసీజీ, ఎకో స్కానింగ్, కంటి సంబంధిత పరీక్షలు, మోకాలు, వెన్నుముకకు సంబంధించిన పరీక్షలు, మహిళా సంబంధిత వ్యాధులకు, అన్ని రకాల జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించారని చెప్పారు. అవసరమైన వారికి వివిధ రకాల టెస్ట్‌ల కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశారని తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ప్రతినిధులు గద్దె శేషగిరి, పి. సుజాతరావు, అంజనేయులు, మిరియాల వెంకటేశ్వరరావు, స్థానికులు కృష్ణయ్య, పిన్నమనేని మురళీకృష్ణ, గిరిజ, సుధ, కొండబాబు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

తెనాలిరూరల్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుర్రిపాలెంలోని శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా ఆలయంలో మహిళలను ఆదివారం సత్కరించారు. మహిళలు చేస్తున్న సేవా కార్యక్రమాలు, ఆలయంలో అందిస్తున్న సేవలను గుర్తు చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరంజ్యోతి మానవ సేవా ఆలయం కమిటీ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు.

విద్యార్థినిని పరిచయం చేయలేదని ఆటోడ్రైవర్‌పై దాడి

తెనాలిరూరల్: నర్సింగ్ విద్యార్థినిని తనకు పరిచయం చేయలేదని ఆటోడ్రైవర్‌పై స్నేహితుడే దాడి చేసి గాయపర్చాడు. పోలీసులు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన రాయల మణికంఠ ఆటో నడుపుతుంటాడు. రామలింగేశ్వరపేటలోని ఓ నర్సింగ్ కళాశాలకు ముగ్గురు విద్యార్థినులను రోజూ తీసుకెళుతుంటాడు. ఈ ముగ్గురిలో ఒక విద్యార్థినిని తనకు పరిచయం చేయాలని మణికంఠను అతని మిత్రుడు నాగుల కోరాడు. దీనికి నిరాకరించడంతో మణికంఠపై నాగుల, అతని స్నేహితుడు ప్రమోద్ దాడి చేయాలనుకున్నారు. ఆదివారం ముత్తెంశెట్టిపాలెంకు మణికంఠ బాడుగకు వెళ్లాడని తెలుసుకుని అక్కడకు వెళ్లి అతనిపై దాడి చేసి గాయపపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి

తెనాలిరూరల్: తీన్‌మార్ కొడుతున్న యువకుడిపై ఇద్దరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన నరసింహ తీన్‌మార్ కొడుతుంటాడు. ఆదివారం ఓ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతుండగా రామలింగేశ్వరపేటలోని రైస్‌మిల్లు సమీపంలో తీన్‌మార్ ఆపాలంటూ జూపల్లి వంశీ, ప్రమోద్ నరసింహతో వాదనకు దిగారు. అంతటితో ఆగకుండా రాయితో అతనిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంటు సీట్లు పెరిగేలా కృషి చేయాలి

తెనాలిఅర్బన్: పార్లమెంట్ స్థానాల పునర్విభజనలో రాష్ట్రానికి ఎక్కువ సీట్లు వచ్చేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు డిమాండ్ చేశారు. మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తెనాలి పార్లమెంట్ స్థానంతోపాటు దుగ్గిరాల, కుచినపూడి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండేవని గుర్తు చేశారు. గతంలో జరిగిన పునర్విభజనలో ఇవి కనుమరుగు అయినట్లు చెప్పారు. మళ్లీ ఇప్పుడు ఆ స్థానాలన్నీ వచ్చేలా చూడాలని కోరారు. టీడీపీ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షంగా ఉందని, సీఎం చంద్రబాబు దీనికోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పొన్నూరు నాగ సూర్యశిఖరరావు, కర్లపూడి బుల్లయ్య, గుర్రపు ద్వారక శ్రీనివాస్, మాదాల పూర్ణచంద్రబాబు, పెనుగొండ శివకుమార్, రాయప్ప, కె.కోటేశ్వరరావు, అయ్యప్ప, కార్తీక్, అఖిల్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి టౌన్ : నగర పరిధిలోని ఆత్మకూరులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ సోమవారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 5న తల పెట్టిన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మార్చి 12వ తేదీకి వాయిదా పడిందని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల అధ్యక్షులు హాజరు కావాలని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



మంగళగిరి టౌన్ : అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని మంగళగిరి పట్టణ సీఐ డి.వినోద్‌కుమార్ రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. రాత్రి 10 గంటల తరువాత రౌడీషీటర్లు వీధుల్లో తిరిగినా, అనుమానస్పదంగా కనిపించినా వారిని విచారించి చర్యలు తీసుకుంటామని అన్నారు. నేర ప్రవృత్తి మార్చుకోకుండా వ్యవహరించే వారిపై పిడియాక్ట్ పెడతామని హెచ్చరించారు. పట్టణ ఎస్ఐలు రవీంద్రనాయక్, హరిబాబు, క్రైం సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, శ్రీరామ్ ఉన్నారు.



క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



తెనాలిఅర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించిన నేపథ్యంలో టీడీపీ నాయకుడు కొలకలూరు వసంత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కొలకలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. చినకాకానిలోని ఎన్ఆర్ఐ హాస్పిటల్ వైద్యులు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కొలకలూరు కిషోర్, ఆరుంబాక నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మున్నంగి(కొల్లిపర): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ పెద్ద ఆరిగ కోటిరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి అన్నారు. ఆదివారం మున్నంగి గ్రామంలో తెనాలి పట్టణంలోని దివి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును గ్రామ పెద్దలు ఆరిగ కోటిరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు వెల్లడించారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు



తెనాలిటౌన్: బాలాజీరావుపేట అయ్యప్ప పురం ప్రధాన అయ్యప్ప దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో దుర్భ హరిబాబు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక శివారు రేగులగడ్డలో సీతారామ దేవాలయ ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించనున్నట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో జెక్కా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వందేళ్ల నాటి ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల తొలగించారని పేర్కొన్నారు. దేవదాయ శాఖ తరుపున రూ.80లక్షలు, ధర్మకర్త తరుపున రూ.40 లక్షలు మొత్తం రూ.1.20కోట్లతో నూతన దేవాలయ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11.28గంటలకు శంకుస్థాపన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కేవీ శ్రీనివాసరావు, ఎండోమెంటు అధికారులు, వ్యవస్థాపక ఆలయ ధర్మకర్త గ్రటాజు లక్ష్మీకాంత్ పాల్గొంటారని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ కుంచనపల్లికి చెందిన ఓ బాధితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును టీడీపీ నాయకులు ఆదివారం అందజేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు కానుగొలను కోటేశ్వరరావు మాట్లాడుతూ గంధం ఉమామహేశ్వరికి రూ.65 వేలు చెక్కును అందజేశామని తెలిపారు. టీడీపీ నాయకులు దాసెట్టి అరుణ, జనసేన నాయకులు పసుపులేటి అశోక్, కొవ్వూరు సురేష్ పాల్గొన్నారు.